క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో రాందాస్‌పల్లి, ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. రాందాస్‌పల్లి అన్ని ఫీడర్ల పరిధిలోని అన్ని గృహ, పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు ఆమనగల్లులో ఎమ్మెల్యే పర్యటన

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీకి టీయూఎఫ్‌ఐడీసీ కింద రూ.15 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లు, మురుగుకాలువలు, పార్కులు నిర్మించనున్నారు. అలాగే సురసముద్రం చెరువు వద్ద వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అలాగే రజకులకు ధోబీఘాట్‌ల నిర్మాణానికి రూ.కోటి మంజూరయ్యాయి. మొత్తం రూ.16 కోట్లతో చేపట్టే పనులకు మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్‌నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కొనసాగుతున్న దీక్ష

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ అలుగు వద్ద బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు చేపట్టిన దీక్ష ఆదివారం 5వ రోజుకు చేరుకుంది. సీసీ రోడ్డు వేసి చేతులు దులుపుకోవాలని పాలకులు చూస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ దారిలో బ్రిడ్జి నిర్మాణమే శాశ్వత పరిష్కారమన్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

తలకొండపల్లి: సీఎం కప్-2023 మండల స్థాయి క్రీడాపోటీలను సోమవారం నుంచి మూడు రోజులపాటు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్నారని ఎంపీపీ తిర్మణీ నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 36 సంవత్సరాల్లోపు ఉన్న యువతీయువకులు ఈ క్రీడల్లో పాల్గొనుటకు అర్హులన్నారు. క్రీడాపోటీల్లో అథ్లెటిక్స్ 100 మీటర్లు, 400 మీటర్లు ఉంటుందని, ఖోఖో, వాలీబాల్ వంటి పోటీలను యువతీయువకులకు వేరువేరుగా, ఫుట్‌బాల్ క్రీడలను పురుషులకు మాత్రమే నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. యువతీయువకులు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

నేడు మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సమావేశం

తుర్కయంజాల్: మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సమావేశం సోమవారం పురపాలక సంఘం పరిధిలోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, యువజన సంఘాల సభ్యులు హాజరుకావాలని కోరారు. చెరువు పరిరక్షణ కొరకు భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యాచరణను రూపొందించనున్నట్లు వారు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న పత్యానాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన జజ్యాల సరోజమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నుంచి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.30 వేలు మంజూరయ్యాయి. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సరోజమ్మకు ఆ చెక్కును జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్ అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు చుక్క నిరంజన్‌గౌడ్, తల్లోజు రామకృష్ణ, సయ్యద్ ఖలీల్, విజయ్‌రెడ్డి, రమేశ్, వడ్డె వెంకటేశ్, భాస్కర్, శివకుమార్, ప్రసాద్, ఆనంద్, శ్రీను, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా విజయ్‌కుమార్



నియామకపత్రం అందజేస్తున్న యాదీష్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంకు చెందిన మైలారం విజయ్‌కుమార్ భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం) జిల్లా అధికార ప్రతినిధిగా నియామకమయ్యారు. ఆ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదీష్ ఈ మేరకు విజయ్‌కుమార్‌కు ఆదివారం నియామకపత్రం అందించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన వారి ఆశలు వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి, నీతిని జాయితీ, క్రమశిక్షణతో పార్టీ అప్పగించే ప్రతి పనిని పూర్తిచేస్తానని తెలి పారు. పదవి వచ్చేందుకు సహకరించిన ప్రతిఒక్కరికి విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ బలోపేతానికి పనిచేస్తానన్నారు.



సాగర్‌రోడ్డు చౌదర్‌పల్లి గేటు వద్ద రోడ్డుకిరువైపులా పూల చెట్లు



ఆగాపల్లి-గునుగల్ మధ్యలో

ఆహ్లాదం @ సాగర్ రహదారి

- రోడ్డుకిరువైపులా పచ్చదనం, పూలచెట్లతో కొత్తందాలు
- రావి, మర్రిచెట్ల కింద సేద తీరుతున్న ప్రయాణికులు



గునుగల్ రిజర్వాయర్ వద్ద మర్రిచెట్లు

యాచారం: నాగార్జునసాగర్-హైదరాబాద్ రహ దారి ఆహ్లాదకరంగా మారింది. రోడ్డుకిరువైపులా ఉన్న పచ్చటి చెట్లకు రకరకాల పూలు పూయడంతో ప్రయాణికులకు కనివిందు చేస్తున్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు రోడ్డుకిరువైపులా ఉన్న మర్రి, రావిచెట్లు, రకరకాల పూల చెట్లతో సాగర్ రోడ్డు పచ్చటి తోరణంగా మారింది. ఎర్రని పూలతో కూడిన చెట్లను చూసి ప్రయాణికులు సాగర్‌రోడ్డుపై హాయిగా సాగిపోతున్నారు. రావోయి బాటసారి అంటూ పూలదారి స్వాగతం పలుకుతోంది. ఎండాకాలం నేపథ్యంలో ప్రయాణికులు కొద్దిసేపు పచ్చటి చెట్ల కింద సేదతీరుతున్నారు. పూల చెట్ల వద్ద సెల్ఫీలు దిగుతున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఉత్సవాల్లో రాఘవేందర్‌రెడ్డి, నాయకులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం అందుగుల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్థంబ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ జయలక్ష్మిరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రం, కేంద్రంలో అధికారంలోకి వస్తాం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆదివారం మండల పరిధిలోని మైసిగండిలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆపార్టీ నేతలు సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, రాజునాయక్, తులసీరాం, రమేశ్, సికిందర్ తదితరులు ఉన్నారు.



కడ్తాల్: స్వీట్లు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్ర విధానాలతో ప్రజలు విసుగెత్తారు..

తలకొండపల్లి: కేంద్రంలోని బీజేపీ పాలనతో ప్రజలు విసుగెత్తారని.. మార్పును కోరుకుంటున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాజాగా కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి.. ఎంతమంది ఎమ్మెల్యేలు గెలిస్తే అన్ని కొబ్బరికాయలు కొడుతానని ప్రభాకర్‌రెడ్డి గతంలో మొక్కుకున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ 136 మంది ఎమ్మెల్యేలతో విజయ దుందుభీ మోగించింది. దీంతో ప్రభాకర్‌రెడ్డితో, సర్పంచ్ శ్రీశైలం 136 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీటీసీ రాములు, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి అజీం, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు విష్ణు, సర్పంచ్ శ్రీశైలం, జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తిలో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీ భక్తాంజనేయ స్వామి, శ్రీ జ్ఞాన సరస్వతి సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నందివనపర్తి, ఎనెకిందతండా, అయ్యావారిగూడ తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందివనపర్తిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి, సమన్వయ మండలి సభ్యులు రామనాథం, అంజయ్య, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, యాదయ్య, నిఖిల్‌రెడ్డి, రుద్ర, కవిత తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్త, నాయకులు వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జగదీశ్, తరుణ్, మల్లేశ్, శ్రీమన్నారాయణ ఉన్నారు.



ఆమనగల్లు: హనుమాన్ పూజలో సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ కిషన్‌రెడ్డి

కొల్కులపల్లి గ్రామంలో..

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ కిషన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



హస్తినాపురం: సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగా సాధన చేయాల్సిన అవసరం ఉందని యోగా గురువు, సేవ యోగిరత్న అవార్డు గ్రహీత ఇస్మాయిల్ గురుజీ అన్నారు. హస్తినాపురంలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్‌లో శ్రీషిరిడి సాయి అష్టాంగ యోగాశిక్షణా తరగతులు ఆదివారం ఘనంగా ఇస్మాయిల్ గురుజీ ప్రారంభించారు. ఇస్మాయిల్ గురుజీ తదితరులు పాల్గొన్నారు.ఈనెల 28 వరకు శిక్షణ ఉంటుందన్నారు.

అక్రమంగా ఇంట్లోకి వెళ్లి బెదిరించిన ఆరుగురి అరెస్ట్

హస్తినాపురం: ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బెదిరింపులకు పాల్పడి భయానక వాతావరణం సృష్టించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఏరియా ఆసుపత్రి దగ్గర ఉన్న మహ్మద్ రియాజ్ ఒక అమ్మాయిని వేధింపులకు గురిచేస్తున్నాని ఆరుగురు వ్యక్తులు శనివారం రాత్రి రియాజ్ ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించారు. వారు బెదిరింపులకు పాల్పడడంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గుండాల ఆనంద్(32) , నిట్టల రంగనాథ్ (45), తన్నీరు లక్ష్మీనారాయణ (29), నేలపాటి రాజేశ్ (26) , షేక్ అబ్దుల్ రజాక్ (27), వినకోటి కొండారావు (40)లపై కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యాచారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2012–13 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. పాఠశాల స్థాయిలో జ్ఞాపకాలను, తీపి గుర్తులను యాది చేసుకుని సంతోషపడ్డారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



వైభవంగా బీరప్ప బోనాలు

యాచారం: మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో బీరప్ప బోనాలు ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగాయి. గొల్లకురుమలు గ్రామంలో నూతనంగా బీరప్ప దేవాలయాన్ని నిర్మించుకున్నారు. బోనాల సందర్భంగా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకోనున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవాలు

ఆమనగల్లు: మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో సందడి నెలకొంది. సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ నర్సమ్మ, సీనియర్ నాయకులు రమేశ్‌గౌడ్, యాదయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: మహేశ్వరంలోని తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గాను ఈనెల 15 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మే 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్1వ తేదీనుంచి ప్రత్యక్ష తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఎస్ఎస్‌సీ మార్కుల లిస్టు, టీసీ, ఆధార్‌కార్డుతో పాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా అడ్మిషన్లు ఇవ్వనున్నామన్నారు. హైస్పీడు ఇంటర్‌నెట్ సదుపాయంతో కంప్యూటర్ ల్యాబ్, గూగుల్ ఈ–క్లాస్ రూమ్, రిటైల్ మేనేజ్‌మెంట్, టూరిజం, హాస్పిటాలిటీ కోర్సులతో పాటు ఒకేషనల్ విద్య అందిస్తామన్నారురు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 98497 46567, 96031 50011లలో సంప్రదించాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన జంగయ్య (54) అనారోగ్యానికిగురై ఆదివారం మృతిచెందాడు. సర్పంచ్ సంగీత శ్రీనివాస్‌యాదవ్ మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆమె వెంట రవి, తిరుపతి, రమేష్, శ్రీకాంత్, పెంటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

వరదముంపు సమస్య పరిష్కారానికి చర్యలు



జలమండలి అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని రేడియో కాలనీలో వరద ముంపు నివారణకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రేడియో కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జలమండలి జీఎం వినోద్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వర్షపు నీరు పోవడానికి సరైన వ్యవస్థ లేకపోవడంతో వరదనీరు కాలనీలో చేరి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. వర్షం నీరు పోవడానికి ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతు డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటులో భాగంగా ఔట్‌లైట్ పైపులైన్ వేయడానికి స్థలం ఇవ్వాలని స్థలయజమాని ముద్దగౌని సుమన్‌గౌడ్‌ను కోరడంతో ఆయన అంగీకరించారని అన్నారు. త్వరలోనే పనులు చేపట్టి కాలనీ సమస్యను పరిష్కరిస్తామని ఆయ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్, నాయకులు అజయ్ యాదవ్, కాలనీ అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు 'గ్రంథాలయ' నిర్మాణ పనులు

- రూ.1.20 కోట్లతో అత్యాధునిక భవనం
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తిచేసి ఈ నెలాఖరులోపు ప్రారంభించడానికి జిల్లా గ్రంథాలయ సంస్థ పాలకవర్గం సన్నాహాలు చేస్తోంది. ఆమనగల్లు పట్టణంలో దశాబ్దాల క్రితం నిర్మించిన గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో నూతన భవనం నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠకులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, గత జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పాండురంగారెడ్డి చొరవ తీసుకుని రాష్ట్ర విద్యాశాఖామంత్రి సబితారెడ్డి సహకారంతో నూతన భవన నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా రూ.కోటి మంజూరు చేశారు. దీంతో గతేడాది రాష్ట్ర మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



నూతన గ్రంథాలయ భవన నిర్మాణం

శరవేగంగా పనులు

గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు కావడంతో భవన నిర్మాణ పనులు చురుకుగా కొనసాగాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. అసంపూర్తిగా ఉన్న పనులకు, ప్రహరీ నిర్మాణానికి నిధులు సరిపోకపోవడంతో ప్రస్తుత జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి అదనంగా రూ.20 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆయా పనులను కూడా పూర్తిచేస్తున్నారు. ఈ నెలాఖరులో భవనాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. భవన నిర్మాణ పనులకు ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ కమటం రాధమ్మ పరిశీలించారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి

రాచకొండ సీపీ డీఎస్.చౌహాన్

మీర్‌పేట: వ్యసనాలకు దూరంగా ఉండడంతోపాటు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ విద్యార్థులకు సూచించారు. మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 21వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు శనివారం రాత్రి జరిగాయి. సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలో కొంత మంది డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, సమయాన్ని వృథా చేయకుండా జీవితంలో ఎలా స్థిరపడాలన్న దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అందుకు కృషి చేసిన అధ్యాపకులకు కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి సీపీ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కళాశాల సెక్రటరీ హరినాథ్‌రెడ్డి, ట్రెజరర్ అమర్‌నాథ్‌రెడ్డి, తీగల అరుంధతి, తీగల తులసి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీపీ చౌహాన్, తీగల కృష్ణారెడ్డి